# ఇండియన్ పాలిటీ

## పార్లమెంటరీ పద్ధతులు - పారిభాషిక పదాలు

పార్లమెంటు ప్రక్రియలో అనేక రకాల సాంకేతిక పదాలు ఎదురవుతాయి. పాలిటీ చదివే అభ్యర్థులకు వాటి గురించి తప్పనిసరిగా తెలియాలి. ఆ పారిభాషిక పదాలు అర్థమైతేనే అత్యున్నత సభ కార్యకలాపాలపై అవగాహన ఏర్పడుతుంది. సభ పద్ధతులు, వాయిదాలు, తీర్మానాలు, ప్రశ్నలు తదితర అన్ని అంశాల పదజాలాన్ని పూర్తిగా అధ్యయనం చేయాలి.

కార్యనిర్వాహక వర్గంపై పార్లమెంటు నియంత్రణకు వివిధ సాధనాలను సభ్యులు ఉపయోగిస్తారు. పార్లమెంటు పనిచేసే విధానంలో అనేక రకాల కార్యక్రమాలు, పద్ధతులు, తీర్మానాలు ఉంటాయి.

**ప్రశ్నోత్తరాల సమయం:** పార్లమెంటు సమావేశాల సమయంలో ప్రశ్నోత్తరాల కార్యక్రమం 11 గంటలకు ప్రారంభమై 12 గంటల వరకు కొనసాగుతుంది. పార్లమెంటులోని లోక్‌సభ సభ్యులు స్పీకర్‌కు, రాజ్యసభ సభ్యులు ఛైర్మన్‌కు 15 రోజుల ముందుగా నిర్దిష్టంగా సమస్య, ఏ మంత్రిత్వశాఖ నుంచి సమాచారం కోరుతున్నారో, ఆ తేదీని స్పష్టం చేయాల్సి ఉంటుంది. అయితే ఒక సభ్యుడు రోజుకు అయిదు ప్రశ్నలకు సమాధానాలను (పార్లమెంటరీ విధానాల్లోని 10b) కోరవచ్చు. ఆ ప్రశ్నలకు సంబంధిత శాఖామంత్రి సమాధానమిస్తారు. ఈ ప్రశ్నలు నాలుగు రకాలు.

అవి:
★ నక్షత్రం గుర్తు ఉన్న ప్రశ్నలు
★ నక్షత్రం గుర్తులేని ప్రశ్నలు
★ స్వల్ప కాలవ్యవధి ప్రశ్నలు
★ ప్రైవేట్ సభ్యులకు ప్రశ్నలు

**నక్షత్రం గుర్తు ఉన్న ప్రశ్నలు:**

వీటికి సంబంధిత శాఖామంత్రి మౌఖిక సమాధానం ఇస్తారు. అవసరమైతే సభ్యులు రెండు లేదా మూడు అనుబంధ ప్రశ్నలను అడగడానికి స్పీకర్ లేదా ఛైర్మన్ అనుమతిస్తారు. రోజుకు మొత్తం 20 ప్రశ్నలకు మాత్రమే అవకాశం ఉంటుంది. వీటిని ఆకుపచ్చ రంగు ఉండే పత్రంలో ముద్రిస్తారు. ప్రశ్నల్లో మౌఖిక ప్రశ్నలను ప్రత్యేకంగా పేర్కొనడానికి లోక్‌సభకు సంబంధించి స్పీకర్‌కు, రాజ్యసభకు సంబంధించి ఛైర్మన్‌కు ప్రత్యేక అధికారం ఉంటుంది.

**నక్షత్రం గుర్తులేని ప్రశ్నలు:**

వీటికి లిఖిత పూర్వక సమాధానం సంబంధిత మంత్రి నుంచి లభిస్తుంది. రోజుకు 230 ప్రశ్నలకు మాత్రమే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా రాష్ట్రపతి పాలనలో ఉన్న రాష్ట్రాలకు సంబంధించి మరో 25 ప్రశ్నలకు సమాధానం ఇస్తారు. అన్నీ కలిపి గరిష్ఠంగా 255 ప్రశ్నలు ఉంటాయి. సాధారణంగా గణాంకాలు, రోజువారీ పాలనకు సంబంధించిన అంశాలను ఈ విభాగంలో చేరుస్తారు. వీటిని తెలుపురంగు పత్రంలో ముద్రిస్తారు.

**స్వల్పకాల వ్యవధి ప్రశ్నలు:**

అత్యవసరమైన, ప్రజాప్రాముఖ్యం ఉన్న విషయాలపై స్వల్పకాల వ్యవధి ప్రశ్నలను అనుమతిస్తారు. సాధారణంగా పది రోజుల కంటే తక్కువ వ్యవధి ఉన్నప్పుడు వీటిని అనుమతిస్తారు. వీటికి మౌఖిక సమాధానం లభిస్తుంది. ఈ ప్రశ్నలను లేత గులాబీ రంగు పత్రంలో ముద్రిస్తారు.

**ప్రైవేటు సభ్యులకు ప్రశ్నలు:**

ఏదైనా ఒక తీర్మానం, బిల్లు లేదా సభకు సంబంధించిన ఇతర అంశాలకు కారణమైన మంత్రి కానటువంటి పార్లమెంటు సభ్యుడిని (ప్రైవేట్ సభ్యుడు) ప్రశ్నలు అడగడానికి సభ్యులను అనుమతిస్తారు. వీటిని పసుపు రంగు పత్రంలో ముద్రిస్తారు.

**జీరో అవర్:**

ప్రశ్నోత్తరాల సమయం తర్వాత మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమై భోజన సమయం వరకు (సాధారణంగా 1.00 pm వరకు) ఉండే కాలాన్ని జీరోఅవర్ అంటారు. ఇది భారత పార్లమెంటు సృష్టించిన పద్ధతుల్లో ఒకటి. ఇందులో అత్యవసర, ప్రజాప్రాముఖ్యం



R-13,21-9-18

ఉన్న 20 ప్రశ్నలను అడగడానికి అవకాశం ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు మూడు నిమిషాలు కేటాయిస్తారు. ముందుగా మంత్రులకు నోటీస్ ఇవ్వాల్సిన అవసరం లేదు. కానీ సభాధ్యక్షుల అనుమతితో (10.00 am కంటే ముందు) ప్రశ్నలు అడగాల్సి ఉంటుంది. ఇది పార్లమెంటు సభ్యులకు ఉత్సాహంగా, మంత్రులకు పరీక్షా సమయంగా ఉంటుంది. ఈ పద్ధతి 1962 నుంచి అమల్లోకి వచ్చింది.

# వివిధ తీర్మానాలు

## విశ్వాస తీర్మానం

రాష్ట్రపతి ఆదేశం మేరకు లోక్‌సభలో మెజారిటీ నిరూపించుకోవడానికి అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రవేశపెట్టే తీర్మానమే విశ్వాస తీర్మానం. ఇది లోక్‌సభలో వీగిపోతే లేదా ఓడిపోతే ప్రధానితో సహా మొత్తం మంత్రిమండలి రాజీనామా చేయాల్సి ఉంటుంది. చరణ్‌సింగ్ విశ్వాస తీర్మానం ఓటింగ్‌కు రాకముందే రాజీనామా చేశారు. ఉదాహరణకు విశ్వాస తీర్మానం కారణంగా ఒక్క ఓటు తేడాతో వాజ్‌పేయి 1999లో రాజీనామా చేయాల్సి వచ్చింది.

## అభిశంసన తీర్మానం

ఒక మంత్రి లేదా కొంత మంది మంత్రులు లేదా మొత్తం మంత్రిమండలి పనితీరు, విధానాలపై సభ్యులకు తీవ్ర అసంతృప్తి ఏర్పడినపుడు నిర్దిష్టమైన కారణాన్ని ఆధారంగా చేసుకుని స్పీకర్ అనుమతితో అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టవచ్చు. అనుమతించడం లేదా తిరస్కరించడంపై స్పీకర్‌దే తుది నిర్ణయం. ఈ తీర్మానం నెగ్గితే సంబంధిత మంత్రి లేదా మంత్రులు రాజీనామా చేయాల్సి ఉంటుంది.

## వాయిదా తీర్మానం

ఎజెండాలో లేని అత్యవసర ప్రజాప్రాధాన్యం ఉన్న అంశాన్ని అదేరోజు లోక్‌సభ దృష్టికి తీసుకురావడానికి వాయిదా తీర్మానాన్ని సభ్యులు ఎంచుకుంటారు. ఉదయం 10 గంటల్లోపు స్పీకర్ సంబంధిత శాఖామంత్రి, లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు లిఖితపూర్వకంగా తెలియజేయాలి. విషయ ప్రాధాన్యం ఆధారంగా స్పీకర్ వాయిదా తీర్మానానికి అంగీకరిస్తే, కనీసం 50 మంది సభ్యులు దీనిపై చర్చకు అనుకూలంగా మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపితే సాయంత్రం 4 గంటలకు ప్రారంభమై రెండున్నర గంటల పాటు లేదా అంతకంటే ఎక్కువసేపు చర్చ కొనసాగుతుంది. ఈ చర్చ తర్వాత ఓటింగ్ జరుగుతుంది. ఓటింగ్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎక్కువ ఓట్లు వచ్చినా రాజీనామా చేయాల్సిన అవసరం లేదు. వాయిదా తీర్మానంపై చర్చ పూర్తయ్యేవరకు సభను వాయిదా వేసే అధికారం స్పీకర్‌కు ఉండదు.

## సభాహక్కుల తీర్మానం

పార్లమెంటు సభ్యులు సభలో అడిగిన ప్రశ్నలకు తప్పుగా సమాధానం ఇచ్చి సభను తప్పుదోవ పట్టించినా లేదా అమర్యాదగా ప్రవర్తించినా లేదా సమాధానం ఇవ్వని పక్షంలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టవచ్చు.

## అవిశ్వాస తీర్మానం

ప్రధాని నాయకత్వంలోని మంత్రిమండలిని నియంత్రించే అతిముఖ్య సాధనాల్లో అవిశ్వాస తీర్మానం ఒకటి. రాజ్యాంగంలోని 75(3) అధికరణ ప్రకారం మంత్రిమండలి లోక్‌సభకు సమష్టిగా బాధ్యత వహిస్తుంది. మంత్రిమండలి బాధ్యతారహితంగా వ్యవహరిస్తే ప్రతిపక్షాలు లోక్‌సభ నిబంధనల్లోని రూల్ 198 ప్రకారం లోక్‌సభలో అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదిస్తాయి. దీనికి నిర్దిష్టమైన కారణం చెప్పాల్సిన అవసరం లేదు. కానీ కనీసం 50 మంది సభ్యుల మద్దతు అవసరం. స్పీకర్ తీర్మానానికి తగిన మద్దతు ఉందని నిర్ధారించుకున్న తర్వాత అనుమతిస్తే పది రోజుల్లో నిర్ణయించిన తేదీన అవిశ్వాస తీర్మానంపై చర్చ, అనంతరం ఓటింగ్ ఉంటుంది. హాజరై ఓటు వేసినవారిలో మెజారిటీ సభ్యులు తీర్మానానికి అనుకూలంగా ఓటు వేస్తే ప్రభుత్వం లేదా ప్రధానితో సహా మంత్రిమండలి రాజీనామా చేయాల్సి ఉంటుంది. ఇప్పటివరకు భారత పార్లమెంటు చరిత్రలో 27 అవిశ్వాస తీర్మానాలను ప్రతిపాదించారు. మొదటి అవిశ్వాస తీర్మానాన్ని 1963లో జె.బి. కృపలానీ (స్వతంత్ర సభ్యుడు) ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంపై ప్రవేశపెట్టారు. చివరిసారిగా 2018 జులైలో ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని మంత్రివర్గంపై ప్రవేశపెట్టారు. అత్యధికంగా (12 సార్లు) ఇందిరాగాంధీ ప్రభుత్వంపై ప్రవేశపెట్టారు.

## సావధాన తీర్మానం

భారత పార్లమెంటు సృష్టించిన పద్ధతుల్లో సావధాన తీర్మానం ఒకటి. దీన్ని 1954లో పార్లమెంటరీ పద్ధతుల్లో చేర్చారు. ఏదైనా ప్రజా ప్రాముఖ్యం ఉన్న సమాచారం దినపత్రికలు లేదా టెలివిజన్ కార్యక్రమాలు లేదా ప్రైవేట్ ఆధారాల ద్వారా తెలుసుకున్న సమస్యపై

సంబంధిత మంత్రి నుంచి అధికారిక వ్యాఖ్యలను రాబట్టడానికి ఈ మార్గాన్ని ఎంచుకుంటారు. అయితే దీనిపై చర్చ, ఓటింగ్, విమర్శలు ఉండవు. తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సభ్యుడు లేదా అదే అంశంపై నోటీస్ ఇచ్చిన అయిదు మంది సభ్యులకు దానిపై వివరణ కోరుతూ ప్రశ్నించడానికి, అనుబంధ ప్రశ్నలకు అవకాశం ఇస్తారు.

★ సావధాన తీర్మానం కోసం సభ్యులు లిఖిత పూర్వకంగా సెక్రటరీ జనరల్‌కు ఉదయం 10 గంటల్లోపు నోటీస్ ఇచ్చి, అదే సమాచారాన్ని స్పీకర్‌కు, సంబంధిత మంత్రికి తెలియజేయాలి. ఒక సభ్యుడు ఒక సమావేశంలో గరిష్ఠంగా రెండు కంటే ఎక్కువ తీర్మానాలను సభలో ప్రవేశపెట్టడానికి స్పీకర్ అనుమతించరు.

## కోత తీర్మానం

ఇది ఏదైనా ఒక మంత్రిత్వ శాఖ బడ్జెట్ ద్వారా కోరిన గ్రాంటులో నుంచి కొంత మొత్తానికి కోత విధించమని పార్లమెంటును కోరుతూ ప్రవేశపెట్టే తీర్మానం. వీటిని లోక్‌సభలోనే ప్రవేశపెడతారు. కోత తీర్మానం నెగ్గితే ప్రభుత్వం రాజీనామా చేయాలి.

★ కోత తీర్మానాలు మూడు రకాలు. అవి:

1) విధాన కోత తీర్మానం

2) పొదుపు కోత తీర్మానం

3) నామమాత్ర కోత తీర్మానం

**విధాన కోత తీర్మానం**

ఒక శాఖ తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించలేదని భావిస్తే, దాని పనితీరుకు నిరసనగా అది కోరినదానిలో నుంచి కొంత మొత్తాన్ని లేదా కనీసం ఒక రూపాయి తగ్గించమని కోరుతూ ప్రవేశపెట్టే తీర్మానమే విధాన కోత తీర్మానం.

**పొదుపు కోత తీర్మానం**

ప్రభుత్వ దుబారాను ఎత్తి చూపడానికి మంత్రిత్వ శాఖ కోరిన మొత్తంలో నుంచి కొంత భాగానికి కోత విధించమని సభ్యులు ప్రవేశపెట్టే తీర్మానమే పొదుపు కోత తీర్మానం.

**నామమాత్ర కోత తీర్మానం**

ప్రభుత్వ పద్దుల నుంచి కొంత మొత్తాన్ని లేదా రూ. 100 తగ్గించమని ప్రవేశపెట్టే తీర్మానమే నామమాత్ర కోత తీర్మానం. భారత ప్రభుత్వం బడ్జెట్‌లో విస్మరించిన అంశాన్ని ఎత్తి చూపడమే దీని ప్రధాన ఉద్దేశం.

**ఎజెండా**

సభలో చర్చించాల్సిన కార్యక్రమాల జాబితానే ఎజెండా అంటారు. ఇది లోక్‌సభ, రాజ్యసభకు వేర్వేరుగా ఉంటుంది. సాధారణంగా సభా కార్యక్రమాలను ఎజెండా ప్రకారమే నిర్వహిస్తారు. సభా వ్యవహారాల సలహా కమిటీ ఎజెండాను రూపొందిస్తుంది.

**అరగంట చర్చ**

ప్రశ్నోత్తరాల సమయంలో తగిన సమాచారం రాని పక్షంలో సభ్యులు మరింత కచ్చితమైన, విస్తృతమైన సమాచారాన్ని సంబంధిత మంత్రి నుంచి రాబట్టడానికి ఈ చర్చ ఉపయోగపడుతుంది. దీన్ని సోమ, బుధ, శుక్రవారాల్లో నిర్వహిస్తారు. ఇది సభ ప్రారంభమైన మొదటి రోజు, బడ్జెట్ సమావేశాల్లో ఆర్థిక బిల్లులు ఆమోదం పొందేవరకు జరగదు. సభ్యులు ప్రజాసమస్యలు, కోరుతున్న సమాచారాన్ని స్పష్టంగా పేర్కొంటూ ఏ రోజున ప్రశ్న అడగదలచుకున్నారో తెలుపుతూ కనీసం మూడు రోజుల ముందు సభ సెక్రెటరీ జనరల్‌కు అందజేయాలి. ప్రవేశపెట్టే సభ్యుడితో పాటు ఇద్దరి సభ్యుల సంతకాలు (మద్దతు) అవసరం. స్పీకర్ లేదా ఛైర్మన్ ప్రశ్నకు అనుమతిస్తే సంబంధిత మంత్రి సమాధానమిస్తారు.

**పాయింట్ ఆఫ్ ఆర్డర్**

సభా కార్యక్రమాలు నియమ నిబంధనలకు అనుగుణంగా లేవని సభలోని సభ్యులు అభ్యంతరం తెలిపినప్పుడు, దానికి సభాధ్యక్షుడు అనుమతిస్తే ఎజెండాలోని అంశాలను పక్కన పెట్టి సభ్యులు లేవనెత్తిన అంశం చర్చకు వస్తుంది. పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తిన సభ్యుడు సభకు, సభా కార్యక్రమాలకు విరుద్ధంగా ఉన్న అంశాలను వివరిస్తాడు. అయితే విరుద్ధంగా ఉన్నదీ లేనిదీ నిర్ణయించే అధికారం సభాధ్యక్షుడికి మాత్రమే ఉంటుంది.

**సభ వాయిదా**

పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో సభను సక్రమంగా నిర్వహించడం సాధ్యం కానప్పుడు, భోజన విరామం లేదా సెలవులు లాంటి కారణాల వల్ల సభా కార్యక్రమాలను సభాధ్యక్షుడు (స్పీకర్/ఛైర్మన్) నిర్ణీత సమయం పాటు నిలిపివేస్తారు. దీన్నే వాయిదా అంటారు. అది కొన్ని నిమిషాలు లేదా కొన్ని గంటలు లేదా కొన్ని రోజులు కూడా ఉండవచ్చు. తిరిగి సభాధ్యక్షుడే సమావేశపరుస్తారు.

**నిరవధిక వాయిదా**

సభా సమావేశాలను సమయం తెలపకుండా నిరవధికంగా వాయిదావేసే అధికారం సభాధ్యక్షుడైన స్పీకర్/ఛైర్మన్‌కు ఉంటుంది. ఒకసారి సభను నిరవధికంగా వాయిదా వేస్తే, మళ్లీ సమావేశపరిచే అధికారం సభాధ్యక్షుడికి ఉంటుంది.

**ప్రోరోగ్**

పార్లమెంట్ సమావేశాలను ముగిసినట్లు ప్రకటించడమే ప్రోరోగ్. తర్వాతి సమావేశాలను ఏర్పాటు చేసేవరకు పార్లమెంట్‌కు విరామకాలం ఉంటుంది. ప్రోరోగ్ అయినప్పటికీ సభ పరిశీలనలో ఉన్న బిల్లులు రద్దుకావు. పార్లమెంటు సమావేశాలను ప్రోరోగ్ చేసే అధికారం రాష్ట్రపతికి మాత్రమే ఉంటుంది. దీనికి భిన్నంగా డిజాల్వ్ చేయడమంటే రద్దు చేయడం. ప్రధానమంత్రి సలహాపై రాష్ట్రపతి లోక్‌సభను రద్దుచేయగలరు.

**గెర్రిమాండరింగ్**

అధికార పార్టీ ఎన్నికల్లో తమ విజయావకాశాలను మెరుగుపరచుకోవడానికి నియోజకవర్గాల సరిహద్దులను మార్చడాన్ని లేదా పునర్ వ్యవస్థీకరించడాన్ని గెర్రిమాండరింగ్ అంటారు.

**గ్యాలప్ పోల్**

ఎన్నికలకు ముందే ప్రజల నుంచి ప్రజాభిప్రాయాన్ని సేకరించడం ద్వారా ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయో అంచనావేయడాన్ని 'గ్యాలప్ పోల్' అంటారు.

**ఎగ్జిట్ పోల్**

ఓటర్లు ఎన్నికల్లో ఓటు వేసిన తర్వాత వారు ఏ పార్టీకి ఓటు వేశారో అడిగి తెలుసుకుని, ఆ సమాచారం ఆధారంగా ఎన్నికల ఫలితాలను (అధికారిక ఫలితాలకు ముందే) విశ్లేషించి, వెల్లడించడాన్ని 'ఎగ్జిట్ పోల్' అంటారు.

**గిలెటిన్**

సభలో కేటాయించిన సమయం ముగిసేటప్పటికి వివిధ బిల్లులపై సమగ్ర చర్చకు తగిన సమయం లేనప్పుడు ఎలాంటి చర్చా లేకుండా బిల్లులను ఆమోదించడాన్ని 'గిలెటిన్' అంటారు.

**క్రాసింగ్**

ఒక రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు మరో రాజకీయ పార్టీలో చేరడాన్ని క్రాసింగ్ అంటారు.

**ఫ్లోర్ క్రాసింగ్**

ప్రతిపక్షానికి చెందిన సభ్యులు అధికార పార్టీలోకి మారడం లేదా అధికార పార్టీకి అనుకూలంగా ఓటు వేయడాన్నే 'ఫ్లోర్ క్రాసింగ్' అంటారు.

**కార్పెట్ క్రాసింగ్**

అధికార పార్టీకి చెందిన సభ్యులు ప్రతిపక్ష పార్టీలోకి ఫిరాయించడం లేదా అధికార పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఓటు వేయడం.

**హంగ్ పార్లమెంట్**

లోక్‌సభ ఎన్నికల్లో ఏ పార్టీకీ లేదా ఎన్నికలకు ముందే ఏర్పడిన ఏ కూటమికైనా మెజారిటీ రాకపోతే దాన్నే 'హంగ్ పార్లమెంట్' అంటారు. 1989లో మొదటిసారిగా హంగ్ పార్లమెంట్ ఏర్పడింది.

**పార్టీ విప్**

పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం ఉన్న ప్రతి పార్టీ ఒక విప్‌ను, అధికార పార్టీ చీఫ్ విప్‌ను నియమిస్తాయి. పార్లమెంటులో సభ్యులు క్రమశిక్షణను పాటించేలా, సభకు హాజరయ్యేలా, ఓటింగ్‌కు హాజరై పార్టీ విధానానికి అనుగుణంగా ఓటు వేసేలా చూడటం విప్ ప్రధాన బాధ్యత. విప్ ఉల్లంఘిస్తే సభ్యులు క్రమశిక్షణా చర్యలకు గురవుతారు.

**మూజువాణి ఓటు**

పార్లమెంటులో తీర్మానం లేదా బిల్లుకు అనుకూలంగా ఉన్నవారిని అయస్ అని, వ్యతిరేకంగా ఉన్నవారిని నోస్ అని చెప్పాలని సూచిస్తారు. నిర్ణయాన్ని ఎవరూ సవాలు చేయకపోతే 'అయస్' ఎక్కువగా ఉందని సభాధ్యక్షుడు ప్రకటిస్తారు. దీన్నే మూజువాణి లేదా వాయిస్ ఓటు అంటారు. మూజువాణి ఓటు అంటే సభలో సభ్యులు ఎవరూ సవాలు చేయనిది, వ్యతిరేకించనిది.

**డివిజన్**

రాజ్యాంగంలోని 100(1), పార్లమెంటరీ రూల్స్‌లోని 367, 367A, 367AA, 367B నిబంధనలు పార్లమెంటులో ఓటింగ్ గురించి తెలియజేస్తాయి. ఓటింగ్ మూడు రకాలు అవి: 1. మూజువాణి 2. డివిజన్ 3. రహస్య బ్యాలెట్ పద్ధతి మూజువాణి ఓటును సభ్యులు సవాల్ చేసినప్పుడు లేదా 2/3వ వంతు మెజారిటీ అవసరమైనప్పుడు డివిజన్ పద్ధతిని ఉపయోగిస్తారు. ఆటోమేటిక్ ఓటు రికార్డింగ్ మెషీన్ అమల్లోకి వచ్చిన తర్వాత ఈ పద్ధతినే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

**ఆపద్ధర్మ ప్రభుత్వం**

ప్రధానమంత్రి రాజీనామా చేసినప్పుడు మరో ప్రభుత్వం ఏర్పడేవరకు పరిపాలనా బాధ్యతలను కొనసాగించాలని రాష్ట్రపతి ప్రధానమంత్రిని కోరతారు. రాజీనామా చేసిన తర్వాత ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పడే వరకు కొనసాగే ప్రభుత్వాన్ని ఆపద్ధర్మ ప్రభుత్వం అంటారు. ఇది ప్రభుత్వ పరంగా విధాన నిర్ణయాలను తీసుకోకూడదు

**మాదిరి ప్రశ్నలు**

**1.** గెర్రిమాండరింగ్ అనే పదం కిందివాటిలో దేనికి సంబంధించింది? (ఏపీపీఎస్సీ అసిస్టెంట్ ప్రొఫెసర్, పొలిటికల్ సైన్స్ – 2018)

1) రహస్య బ్యాలెట్ 2) నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ

3) బహుసభ్య నియోజకవర్గాలు 4) పరోక్ష ఎన్నిక

**2.** పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల ఎన్నికల ఫలితాలను ముందుగా తెలిపే, కొత్తగా ప్రజాదరణ పొందిన పరిశీలనా సాంకేతిక పరిజ్ఞానం? (ఏపీపీఎస్సీ గ్రూప్ – 1, 2007)

1) ఒపీనియన్ పోల్ 2) ఎలక్షన్ సర్వే 3) ఎగ్జిట్ పోల్ 4) శాంపుల్ సర్వే

**3.** 'జీరో అవర్' అంటే? (ఏపీపీఎస్సీ గ్రూప్ – 1, 2003 బ్యాక్‌లాగ్)

1) సభ్యులు ప్రశ్నలు అడిగే సమయం

2) సభ్యులు ఎవరూ హాజరు కాని సమయం

3) ప్రశ్నోత్తరాల సమయం ముగిసిన తర్వాత సభాకార్యక్రమాలు మొదలవడానికి మధ్యలో ఉండే సమయం

4) ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభమవడానికి, సభాకార్యక్రమాలు ముగియడానికి మధ్య ఉన్న సమయం

**4.** పార్లమెంట్‌లో నక్షత్రపు గుర్తు ఉన్న ప్రశ్నకు ఏ విధమైన సమాధానం రావాలి? (ఏపీపీఎస్సీ గ్రూప్ – 1, 1991)

1) లిఖితపూర్వక సమాధానం 2) మౌఖిక సమాధానం

3) సమాధానం ఇవ్వకపోవడం 4) చర్చ

**5.** మంత్రివర్గంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి లోక్‌సభలో అవసరమైన సభ్యుల సంఖ్య? (ఏపీపీఎస్సీ ఏఈఈ – 2011)

1) 100 2) 150

3) 50 4) లోక్‌సభలోని మొత్తం సభ్యుల్లో 1/3వ వంతు

**సమాధానాలు:** 1–2; 2–3; 3–3; 4–2; 5–3.

**రచయిత: డాక్టర్ ముప్పాల భాస్కరరాజు**



www.eenadupratibha.net